జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 21-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 170 పేజీలు: 8 వెల : రూ.7



## గంజాయి బ్యాచ్..

# రౌడీయిజం

* నగరంలో పేట్రేగిపోతున్న గంజాయి బ్యాచ్
* వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ హడలెత్తిస్తున్నారు
* డీసీసీబీ కాలనీలో ఓ యువకుడిపై బ్లేడులతో దాడి
* గాయాలతో తప్పించుకున్న వ్యక్తి
* మత్తులో ఏం చేస్తున్నారో తెలియని దుస్థితి
* పెద్ద మార్కెట్‌లోనూ పలువురు వ్యాపారులపై దాడులు
* హడలిపోతున్న నగరవాసులు

శ్రీకాకుళం క్రైం, నవంబర్ 20 (వార్త):
జిల్లా కేంద్రంలో గంజాయి బ్యాచ్ పేట్రేగిపోతున్నారు. మత్తులో మునిగితేలుతూ ఏకంగా దాడులకు దిగుతున్నారు. చంపేస్తాం.. నరికేస్తాం అంటూ రౌడీయిజం ప్రదర్శిస్తున్నారు. ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ నగరవాసులను హడలెత్తిస్తున్నారు. రోజురోజుకూ వీరి ఆగడాలు పెరుగుతుండడంతో పోలీసులకు సైతం ఇది పెద్ద తలనొప్పిగా మారింది. బుధవారం అయితే ఏకంగా ఓ యువకుడిపై ముగ్గురు గంజాయి బ్యాచ్ బ్లేడ్‌తో కనిపించినచోటల్లో దాడి చేశారు. ఆ వ్యక్తి వారి నుంచి తప్పించుకుని పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలో నివాసముంటున్న వ్యక్తి తన ఇంటికి కావాల్సిన సామగ్రిని తెచ్చుకోవడానికి ఇందూ బ్యూటీ పార్లర్ సమీపాన ఉన్న షాపు వద్దకు వెళ్లాడు. సామగ్రితో కొనుగోలు చేసి వస్తుండగా ముగ్గురు యువకులు ద్విచక్రవాహనాన్ని స్పీడ్‌గా నడుపుకుంటూ అతనిపైకి దూసుకువచ్చారు. దీంతో ఆ వ్యక్తి వారిని నిలువరించిన ప్రయత్నం చేశాడు. దీంతో ఆ ముగ్గురు యువకులు వారి వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో ఆ యువకుడిపై విచక్షణరహితంగా దాడి చేశారు. దీంతో ఓ వ్యక్తి వీరి నుంచి తప్పించుకుని జనావాసాలు ఉన్న ప్రాంతానికి పరుగుపెట్టి ప్రాణాలు కాపాడుకున్నాడు. దీన్ని చూసిన కొందరు కేకలు వేయడంతో వారు మత్తులో తూగుతూ అరుస్తూ పారిపోయారు. వీరంతా గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో ఉన్నారని బాధితుడు వాపోయాడు. అయితే స్థానికులు కొందరు ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీల సేకరణలో పనిలో పడ్డారు. ఆ ముగ్గురు యువకులు ఎవరన్న దానిపై ఆరా తీస్తున్నారు. గాయపడిన వ్యక్తి ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు శ్రీకాకుళం పెద్దమార్కెట్‌లో కూడా తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు వ్యాపారులపై సైతం దాడులకు, బెదిరింపులకు దిగుతున్నారు.

## సిక్కోలులో జోరుగా గంజాయి విక్రయాలు

జిల్లా కేంద్రంలోని పలు షాపుల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే గంజాయిని తెలిసిన వారికి మాత్రమే విక్రయిస్తున్నారు. కొత్తవారికి ఇవ్వడం లేదు. గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్నారు. గంజాయి అమ్మకాలు వల్ల డబ్బులు బాగా వస్తాయని కొందరు ఆశతో సరిహద్దు ప్రాంతమైన ఒడిశాకు వెళ్లి వీటిని తీసుకువచ్చి చిన్నచిన్న పొట్లాలు రూపంలో నగరంలో విక్రయిస్తున్నారు. కొందరు పోలీసులకు ఈవిషయం తెలిసినా గంజాయి బ్యాచ్ దాడులు చేస్తుండడంతో సైలెంట్ అవుతున్నారు. గతంలో గంజాయిని నగర శివారులో విక్రయించడం, తాగడం వంటివి చేసేవారు. పోలీసుల గస్తీ ఎక్కువ కావడంతో కొందరు రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఎవరికీ అనుమానం రాకుండా వీటిని అమ్మకాలు చేస్తున్నారు.



## గంజాయిని అడ్డుకోండి

### * ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఇచ్ఛాపురం, నవంబర్ 20(వార్త): గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు సరిహద్దు చెక్ పోస్టు, రహదారి మార్గంలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఇచ్ఛాపురం టౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలతో పాటు ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. రికార్డులు, కేసు ఫైల్స్‌ను తనిఖీ చేసి కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ గంజాయి తరలింపును అడ్డుకోవాలన్నారు. సంకల్పం పేరిట అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం పురుషోత్తపురం చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట కాశీబుగ్గ డీఎస్పీ వి.వి.అప్పారావు, ఇచ్ఛాపురం సీఐ చిన్నం నాయుడు, ఎస్సైలు శ్రీనివాస్‌రావు, రవి వర్మ, సిబ్బంది ఉన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## స్మార్ట్‌మీటర్లు వద్దంటూ ధర్నా

**ఎచ్చెర్ల నవంబర్ 20 (వార్త):** ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నడ్డివిరిచే కార్యక్రమాలకు స్వస్తి పలకకపోతే ఉద్యమి స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, హమాలీ యూనియన్ నాయకులు ఎం.సురేష్, కె.గోవిందకుమార్ పాల్గొన్నారు. అలాగే లావేరులోనూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రజలపై భారాలు మోపే ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రక్రయ నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ డిమాండ్ చేశారు. బుడుమూరు సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు నాగరాజు, అశోక్, శ్రీనివాసరావు ధర్నా నిర్వహించారు.

# బాలల హక్కుల పట్ల అవగాహన ఉండాలి

*** మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతిశ్రీ**



**శ్రీకాకుళం టౌన్, నవంబర్20 (వార్త):** బాలల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి.శాంతిశ్రీ వెల్లడించారు. డిశంబరు 3వ తేదీన జరుగనున్న ప్రపంచ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి విభిన్న ప్రతిభా వంతుల ఆటల పోటీలను ఆర్అండ్‌బి డచ్ భవనం వద్ద నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నవంబరు 1 నుండి నవంబర్ 30 వరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రమణ మాట్లాడుతూ బాలల హక్కుల దినోత్సవం ఈ నెల 14వ తేదీన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాలల హక్కుల వారోత్సవాలను చేశామన్నారు. జిల్లాలోని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అంతటా బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలల హక్కులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో బాలల హక్కుల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 1 నుండి 30వ తేదీ వరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. చట్ట బద్ధమైన పిల్లలు దత్తతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దత్తత దివ్యాంగ పిల్లల్ని దత్తత ఇస్తున్నట్లు తెలిపారు. 0-18 సంవత్సరాల వరకు దత్తత ఇస్తున్నట్లు చెప్పారు. దత్తత దేశంలో ఉన్న వారే కాకుండా ఇతర దేశస్థులు చట్ట బద్ధంగా తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల శాఖ సహాయ సంచాలకులు కవిత, తదితరులు పాల్గొన్నారు.

### వ్యత్యాసాలను పోగొట్టే వారే బాలలు

వ్యత్యాసాలను పోగొట్టి, అడుగంటి పోతున్న మానవ సంబంధాల్లో విలీనత తెచ్చే సామర్థ్యం కలిగిన వాళ్ళే పిల్లలని మహిళా, శిశు సంక్షేమ సాధికారత జిల్లా అధికారి బి.శాంతి శ్రీ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా మహిళా కళాశాల నుంచి సూర్య మహల్ జంక్షన్ వరకు బాల బాలికలతో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. సూర్య మహల్ కూడలి వద్ద మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నవంబర్ 14న బాలల దినోత్సవం, నవంబర్ 20 అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఈ రెండు తేదీల మధ్య వారం రోజులు బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామని చెప్పారు. పిల్లలు అనే పదానికి న్యాయపరమైన నిర్వచనం కడుపులో ప్రాణం పోసుకున్నప్పటి నుండి 18 సం.లు పూర్తిగా నిండే వరకు ఉన్న వ్యక్తులందరూ పిల్లలేనన్నారు. జాతి, మత, కుల, ప్రాంత, భాష, పుట్టుక, అన్ని రకాల వైకల్యాలు, ప్రత్యేక అవసరాలు కలిగిన వాళ్ళంతా ఏ తేడా లేకుండా 18 ఏళ్ల లోపు ఉంటే వారు పిల్లలేనన్నారు. అన్ని హక్కులూ, అన్ని రాయితీలు అందరికీ సమానంగా వర్తిస్తాయని చెప్పారు. శ్రీకాకుళం డిఎస్పి సిహెచ్ వివేకానంద మాట్లాడుతూ మానవ హక్కులు, రాజ్యాంగం, వివిధ బాలల హక్కుల చట్టాలు, వివక్షత లేని గౌరవంతో కూడిన సమానత్వం వీటిపై ఇప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వీరికి హింస, భయం లేని జీవితాలను అందించడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బాల, బాలికలు అంతా బాలల హక్కులపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. డిఐపిఆర్ఓ కే.చెన్నకేశవరావు, ఐసిపిఎస్ రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



### ఉన్నత శిఖరాల అధిరోహణకు మొదటి మెట్టు పాఠశాల

అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక బొందిలిపురం ప్రైమరీ స్కూల్‌ను సీనియర్ సివిల్ జడ్జి , జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు బుధవారం సందర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాల అధిరోహణకు మొదటి మెట్టు పాఠశాల అని తెలిపారు. పాఠశాలలో పిల్లల పట్ల శ్రద్ధ చూపించి బాధ్యతయుతంగా చదువు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, హెచ్ఎం బి.ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



అనుమానాస్పదంగా

# రెడ్‌ఫోర్స్ బృందం

***అరసవల్లి, కళింగపట్నంలో బాంబులు పెట్టేందుకు యత్నం * వారిని అదుపులోకి తీసుకున్న మెరైన్ పోలీసులు *డమ్మీ ఆర్డీఎక్స్‌లు స్వాధీనం * సాగర్ కవచ్‌లో భాగమని తెలిసి ఊపిరిపీల్చుకున్న ప్రజలు**

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 20(వార్త):** సాగర్ కవచ్‌లో భాగంగా రెడ్ ఫోర్స్ విశాఖపట్నం నేవీ బృందం అరసవల్లి, కళింగపట్నం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో మెరైన్ పోలీసులు పట్టుకున్నారు. కళింగపట్నం లైట్‌హౌస్ వద్ద బుధవారం ఉదయం 10 గంటల సమయంలో రెడ్ ఫోర్స్ బృందం డమ్మీ ఆర్డీఎక్స్ బాంబు పెట్టేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో మెరైన్ సీఐ ప్రసాదరావు ఎస్ఐలు వి.బాలకృష్ణ, కె.మహాలక్ష్మి, ఏఎస్ఐ వైకుంఠరావు, హెచ్‌సీ శ్యామలరావు, బాపూజీ, బీవీ ప్రసాద్, రాంబాబు, దుర్గారావులు పట్టుకుని గార పోలీసుస్టేషన్‌కు తరలించారు. దర్యాప్తు నిర్వహించి రెడ్‌ఫోర్స్ బృందానికి చెందిన వారిగా గుర్తించారు. ఆతర్వాత పోలీసులు వారిని విడిచిపెట్టగా మళ్లీ అరసవల్లి ఆలయంలో బాంబు పెట్టేందుకు ప్రయత్నించి పట్టుబడ్డారు. వీరు సాధారణ భక్తుల మాదిరిగా ఆలయానికి బ్యాగ్‌తో వచ్చారు. ఆలయం బయట అనుమానాస్పదంగా కనిపించడంతో సీఐ బర్ల ప్రసాదరావు తనిఖీలు నిర్వహించారు. బ్యాగులో డమ్మీ ఆర్డీఎక్స్ బాంబును గుర్తించిన మెరైన్ పోలీసులు వారిని పట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇద్దరు రెడ్ ఫోర్స్ బృందాన్ని మెరైన్ సీఐ బర్ల ప్రసాదరావు సిబ్బందితో పట్టుకున్నారు.

## చోరీ కేసులో ఇద్దరికి జైలు

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 21 (వార్త):** ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన ఘటనలో ఇద్దరికి రెండేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఒకటో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు ఇచ్చారని రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన కొయ్య పాపారావు, మద్ది పరశురాం శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేట వద్ద ఓ మహిళ మెడలోని పుస్తెల తాడును 2021 అక్టోబరు10న తెంపుకొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారని, నిందితులను అదుపులోకి తీసుకున్నారన్నారన్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి తీర్పు చెప్పారన్నారు.



కవిటి ఎస్ఐగా

## రవివర్మ

**కవిటి/కొత్తూరు, నవంబర్ 20 (వార్త):** కవిటి ఎస్ఐగా రవివర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐకు బదిలీ కావడంతో నూతన ఎస్ఐగా రవివర్మను నియమిస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కొత్తూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎంఏ అహ్మద్‌కు బుధవారం ఇంటిలిజెన్స్ విభాగానికి డెప్యుటేషన్‌పై బదిలీ అయింది.

# డ్రోన్లతో నిరంతర నిఘా

*** వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా పోలీసు శాఖ**
*** నిత్యం నగరంలో డ్రోన్లతో గస్తీ**

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 20(వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీసులు వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి వినియోగం, తదితర నేరాలు అదుపునకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. నిత్యం శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేస్తూ ప్రత్యేక పోలీసు సిబ్బంది నిఘా ఉంచుతున్నారు. నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల డచ్ బంగ్లా, దమ్ముల వీధి, కంద్రి వీధి, కంపోస్ట్ కాలనీ, ఎపిహెచ్బి కాలనీ, వాంబే కాలనీ, మంగువారితోట, గుజరాతీపేట పాత బ్రిడ్జి పరిసరాలు నది పరీవాహక ప్రాంతాలతోపాటుగా ఆయా పరిసర ప్రదేశాలలో పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 'భూహక్కు పత్రాల్లో సవరణకే సభలు'



**సారవకోట, నవంబర్ 20(వార్త):** రైతుల భూహక్కు పత్రాలలో సవరణలు చేపట్టినందుకుగాను ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం సారవకోట మండలం అన్నుపురం రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో ఇచ్చిన భూహక్కు పత్రాలలో నేడు కొన్ని సవరణలు చేపట్టాల్సి వచ్చిందని, వాటిని నేడు సవరిస్తున్నామని వివరించారు.

# 'ధాన్యం అమ్మకాల్లో రైతులకు పూర్తి స్వేచ్ఛ'

**నరసన్నపేట, నవంబర్ 20(వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు రైతులు ధాన్యం అమ్మకాలకు సంబంధించి వారికి పూర్తి స్వేచ్ఛను అందించాలని శ్రీకాకుళం సివిల్ సప్లై డిఎం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్థానిక సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17 శాతం తేమతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయవలసి ఉంటుందని ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

### 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలో ధాన్యం కొనుగోలుకు లక్ష్యం నిర్దేశించడం జరిగిందని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. నాలుగు లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్దేశించామన్నారు. జిల్లాలో 402 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



# జిల్లాలో డీఈవో సుడిగాలి పర్యటన!

**సోంపేట, నవంబర్ 20 (వార్త):** జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య బుధవారం సోంపేట మండలంలోని పలు పాఠశాలల్లో సుడిగాలి పర్యటన జరిపారు. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాఠశాలలు తెరిచే సమయం కన్నా ముందుగా వాలిపోతున్నారు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయులు ఎలా ఉండాలో క్లాస్ చెబుతున్నారు. మంగళవారం మందస మండలంలో పర్యటించిన ఆయన హైస్కూల్ లో ఉన్న లోపాలను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య పెంచకపోతే అటువంటి పాఠశాలలకు భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయని ,హెచ్ ఎం పోస్ట్ ఉండాలంటే సుమారు75 మంది విద్యార్థులు ఉండాలని ఎర్రముక్కాం హెచ్ ఎం అనంతరావును సూచించారు. ఇక్కడ హాస్టల్‌లో విద్యార్థులు సంఖ్య విని ఆశ్చర్యం చెందారు. ఇలాగే కొనసాగితే హాస్టల్ ఎత్తి వేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుల్లో చురుకుగా ఉన్నారని ,వారిని మరింతగా పదును పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామస్తులు ,ప్రజా ప్రతినిధులు సహకారాన్ని తీసుకుని పాఠశాలలు అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ఉన్న ఊరులో కాకుండా ప్రయివేట్ పాఠశాలలకు పంపే తల్లి తండ్రులకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని అన్నారు. వారు వినకపోతే హైస్కూల్ వేరే పాఠశాలలో విలీనం చేస్తామని చెప్పాలి. జింకిభద్ర ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల ఆవరణలో జరుగుతున్న పాంశాల సముదాయ సమావేశాన్ని సందర్శించి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల అభివృద్ధి తీరుని తెలుసుకుని ఉపాధ్యాయులను అభినందించారు. మామిడిపల్లి, రాజాం కెబిజివి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు తో ముచ్చటించారు. ప్రధానోపాధ్యాయులు బెహరా వేణు గోపాలరావు, జగదీష్, జగన్, జోగారావు,పురుషోత్తం,పార్వతి పాల్గొన్నారు.



# అబద్ధాలు వల్లెవేయడం ఎమ్మెల్యే బగ్గుకు తగదు



**నరసన్నపేట, నవంబర్ 20 (వార్త):** అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు వల్లె వేయడం ఎమ్మెల్యే బగ్గుకు తగదని.. వాస్తవాలు నరసన్నపేట ప్రజలందరికీ తెలుసునని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, సుడా మాజీ చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, పొందర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజాపుఅప్పన్న దుయ్యబట్టారు. బుధవారం సాయంత్రం నరసన్నపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వీరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అసెంబ్లీలో వంద పడకల ఆసుపత్రిని తానే అభివృద్ధి చేసినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ చొరవతో నరసన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వంద పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకొందని.. అలాగే ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు కూడా కేవలం కృష్ణ దాస్ చలవేనని వీరు చెప్పుకొచ్చారు. అలాగే క్రీడల కోటగా ఉన్న నరసన్నపేటలో ఇండోర్ స్టేడియం అవసరమనే ఆలోచన కూడా కృష్ణదాస్ దేనని.. పూర్తిస్థాయి నిధులు.. బిల్లులు మంజూరు కూడా కృష్ణదాస్ ఎంతో కృషి చేశారనే విషయాన్ని మర్చిపోయి మాట్లాడడం సరికాదన్నారు. ప్రస్తుతం నరసన్నపేట నియోజకవర్గంలో ఇసుకసురుల రాజ్యం కూటమి ఎమ్మెల్యే నేతృత్వం లోనే జరుగుతోందని.. గోపాలపెంట ఇసుక ర్యాంపు నుండి ఎమ్మెల్యే బంధువులే రాత్రికి రాత్రి వందల కొలది లారీలు అక్రమంగా దోచుకుపోతున్నారని ఆరోపించారు. మద్యం సిండికేట్ వ్యాపారం, బెల్ట్ షాపులు నిర్వహణ ఎమ్మెల్యే బంధువులు వదలడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బొబ్బాది ఈశ్వరరావు, బగ్గు రమణయ్య, దుల్లా రమణ, సతివాడ రామినాయుడు, బగ్గు సతీష్, కనపల అరవింద్, రావాడ రామారావు, కోటిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల సభను జయప్రదం చేయండి




**పలాస, నవంబర్ 20(వార్త):** ఈ నెల 21న ఉదయం 10 గంటలకు వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడు అమరవీరుల స్మారక స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ సభ జరుగుతుందని, ఈ సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు బుధవారం పలాస సూదికొండ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరుల ఆశయాలను తుదికంట కొనసాగించాలని, ఈ దేశంలో దున్నేవానికి భూమి దక్కి ఎంతవరకు పోరాడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. అమరుల బాటలో ప్రయాణించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయనతో పాటుగా భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ నాయకులు సవరకుమార్, ఆనంద్ బెహరా, పిఓడబ్ల్యూ నాయకురాలు సరస్వతి, పతివాడ షణ్ముఖరావు జుట్టు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు తప్పని అపార్ అగచాట్లు

**నరసన్నపేట, నవంబర్ 20(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న ఆపార్ నమోదు ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు అగచాట్లు తప్పడం లేదు. ఏ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో చూసిన ఇదే పరిస్థితి కనిపిస్తుంది. బుధవారం నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆపార్ నమోదుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడమే కారణంగా తెలుస్తుంది.

## చలో విజయవాడ విజయవంతం చేయండి



**జలుమూరు, నవంబర్ 20(వార్త):** ప్రస్తుతం ఉన్న విధానాలను రద్దు చేయాలని కోరుతూ డిసెంబర్ 10న విజయవాడలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఏపీసీపీ ఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు ప్రభుత్వ ఉద్యోగులను కోరారు. ఈ మేరకు మంగళవారం జలుమూరు మండలం కరవంజ మోడల్ స్కూల్లో చలో విజయవాడ పోస్టర్ను ఆవిష్కరించారు. ఉద్యోగులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని, పాత పింఛన్ విధానం కొనసాగించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## కేఎల్ఎన్ పేటలో భారీ చోరీ



**జలుమూరు, నవంబర్ 20(వార్త):** జలుమూరు మండలంలోని కేఎల్ఎన్ పేటలో సనపల లక్ష్మి ఇంటిలో భారీ చోరీ జరిగింది. 16 తులాలు బంగారం, 800 గ్రాములు వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. 20 రోజుల క్రితం చెన్నైలో ఉన్న తన భర్త దగ్గరకు వెళ్లి వచ్చేటప్పటికి ఇలా జరిగిందని లక్ష్మి తెలిపారు. దీంతో జలుమూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్ బాబు క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించి మంగళవారం కేసు నమోదు చేశామన్నారు.

## ఆయుష్ కేంద్రాల్లో ఆశ వర్కర్ల సేవలు

**నరసన్నపేట, నవంబర్ 20(వార్త):** రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఇకపై ఆశా వర్కర్ల సేవలను పొందడం జరుగుతుందని ఆయుష్ శాఖ వైద్యాధికారిణి వి సీతామాలక్ష్మి తెలిపారు. బుధవారం నరసన్నపేట మండలం మాకివలస పీహెచ్సీలో ఈ మేరకు ఆశా వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కేవలం పీహెచ్సీలకు పరిమితమైన ఆశాలు నేడు ఆయుష్ శాఖలో కూడా విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆమెతోపాటు వైద్యాధికారిని శిరీష పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రమాదకరంగా సిమెంట్ పలకలు

**నరసన్నపేట, నవంబర్ 20(వార్త):** నరసన్నపేటలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నరసన్న చెరువు రహదారికి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డుపై పలకలు శిథిలం అయ్యాయి. ఈ రహదారి గుండా సర్వీస్ రోడ్డుకు వెళ్లే పలువురు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా ఈ పరిస్థితి నెలకొని ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం దీనిపై కన్నెత్తి చూడకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఉన్నత శిఖరాలు అధిరోహించండి

**మెళియాపుట్టి, నవంబర్ 20(వార్త):** విద్యార్థి దశ నుండే విద్యతోపాటు ఆటపాట అన్నింటిలో ముందుండేలా, ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానికి అనుగుణంగా పదిమందికి ఆదర్శంగా ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. శాఖగ్రంథాలయ అధికారిని అనురాధ ఆధ్వర్యంలో జరుగుతున్న 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు మండల కేంద్రంలో గల స్థానిక గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పాఠ్యాంశాలతోపాటు గ్రంథాలయాలలో పుస్తక పఠనాన్ని అలవర్చుకొని తద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చున్నారు. ఈ



కార్యక్రమంలో విద్యాశాఖధికారులు దేవేంద్రరావు, పద్మనాభం, సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, నలంద ప్రిన్సిపల్ ప్రతాప్, తదితరులు అనేక అంశాలను విద్యార్థులకు తెలియపరిచారు. విద్యాశాఖధికారులు దేవేందరరావు, పద్మనాభంలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మూఢనమ్మకాలను ఎవరూ నమ్మవద్దని కొన్ని ప్రయోగాలు చేసి చూపించారు. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సెల్ ఫోన్ వద్దు పుస్తకమే ముద్దని పి. రమేష్ బాబుఅన్నారు., జడ్పీహెచ్. ఎస్. ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ జె. జె. ఎస్. ప్రతాప్ మాట్లాడుతూ గ్రంథాలయాలలోనున్న పుస్తకాలలో పోటీతత్వానికి సరిపడే పుస్తక పఠనాన్ని ఇప్పటినుండి అలవర్చుకోవాలన్నారు. మహిళా పోలీస్ భారతి, స్థానిక గ్రంథాలయ అధికారిని అనురాధ, ఉపాధ్యాయులు శాంతకుమారి, నీలిమ, నమిత బరోడా, యువత ప్రియాంక, ధనుంజయ్, విద్యార్థులు, రీడర్స్, సహాయకురాలు హేమలత తదితరులున్నారు. అనంతరం ఇటీవల కాలంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం గావించారు. వ్యాసరచన సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి వి. కావరి, కేజీబీవీ పాఠశాల, క్యారం బాక్స్ లో ద్వితీయ బహుమతి బందారు దినేష్, తృతీయ బహుమతి ఎల్. ఉష కేజీబీవీ, చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి కృష్ణ ప్రధాన్, ద్వితీయ బహుమతి జి సంధ్య, తృతీయ బహుమతి మమత ప్రధాన్, రంగవల్లికలలో ప్రథమ బహుమతి జి. మౌనిక ద్వితీయ బహుమతి జి. కావ్య తృతీయ బహుమతి ఎస్. కావ్య, జూనియర్స్ విభాగంలో జి. యోగప్రియ, గాయత్రి, లావణ్య, చంద్రలేఖ, నిహారిక, కృపారాణి, తదితరులున్నారు.



## విజేతలకు బహుమతులు అందజేత

**సారవకోట, నవంబర్ 20(వార్త):** సారవకోట మండల కేంద్రంలోని స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించడం జరిగిందని గ్రంథాలయ అధికారి సాయమ్మ తెలిపారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా సారవకోట స్పెషల్ ఆఫీసర్ ఎం. లోకనాథం విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు.

## అపార్ నమోదును పరిశీలించిన ఎంఈవో



**జలుమూరు, నవంబర్ 20(వార్త):** అపార్ నమోదు పట్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే దానికి సంబంధించిన సలహాలు, సూచనలను ఇవ్వడం జరుగుతుందని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. బుధవారం జలుమూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ భాగంగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అపార్ నమోదు పట్ల కలెక్టర్ దృష్టి సారించారన్నారు. దీనిపై అపోహలను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు ఎంతో కీలకం



**మందస, నవంబర్ 20(వార్త):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ఎంతో కీలకమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, సీనియర్ నాయకుడు రాజాన మహేశ్ అన్నారు. మేజరు పంచాయతీ మందసలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఎక్కువ సంఖ్యలో కార్యకర్తలను సభ్యులుగా చేర్పించాలన్నారు. ప్రతీ ఒక్కరూ సభ్యత్వాన్ని తీసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఓ యజ్ఞంలా చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గార కృష్ణారావు, బూరగాపు శంకరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు

**జలుమూరు, నవంబర్ 20 (వార్త):** 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నవంబర్ 14-20 వరకు జలుమూరు గ్రంథాలయం వారి ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. దీనిలో భాగంగా ముగింపు వేడుకలు స్థానిక మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల, జలుమూరులో వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి పిల్లలకు బహుమానాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మెండ. రామారావు , లైబ్రేరియన్ ఆర్.డిల్లేశ్వరి , ఉపాధ్యాయులు బి.సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, పి. రమేష్, పి. కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వంగర, నవంబర్ 20(వార్త):** ప్రజలు సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక శంకర్ పేర్కొ ఋషింగి,మద్దివలస గ్రామాల్లో ని ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ర్యాలీ నిర్వ హించారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచారం,వారు చేసే ఫోన్ లింక్ లు ఓపెన్ చేయవద్దని కోరారు. పోలీస్ కనువిప్పు సందర్భంగా ఎస్ఐ షేక్ శంకర్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులమని, రుణమాఫీ వస్తుందని కరెంట్ బిల్లు కట్టాలని, కేవైసీ అప్డేట్ చేయాలని, విదేశాలలో మీ పిల్లలు ఉంటే వారి పేరు చెప్పి అక్కడ నేరం చేశారని చెప్పి మోసం కాల్స్ చేస్తారన్నారు. మీకు తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, పిల్లల ప్రవర్తనలో ఏమైనా మార్పులు ఉన్నాయా, ఇంటికి ఏమైనా ఆన్లైన్ ద్వారా పార్సల్స్ వస్తున్నాయా ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా మార్పులు ఉంటే ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. యువతి యువకులను గంజాయి డ్రగ్స్ ఇతర




మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అట్టి వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.పోలీస్ కళా బృందం కనువిప్పు ద్వారా మూఢనమ్మకాల పై మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు, పేకాట ఆడుట వలన కుటుంబలో జరుగుతున్న పరిణామాలను, వరకట్నం వలన జరుగుతున్న సంఘటనలు, ఆత్మహత్యలు, వృద్ధులైన తల్లిదండ్రులను మంచి చూసుకోవాలి, డ్రైవింగ్ లైసెన్స్ , షీ టీమ్స్ జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

**మందస, నవంబరు 20(వార్త):** మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని, దీంతో జీవితాలు నాశనమవుతాయని కాశీబుగ్గరూరల్ సీఐఎం.తిరుపతిరావు కోరారు. మందస బస్టాండ్ ప్రాంతంలో సంకల్పం పేరుతో మాదక ద్రవ్యాలపై అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో కుటుంబాలు, జీవితాలు నాశనమవుతాయని, వాటి వైపుకన్నెత్తి కూడా చూడకూడదన్నారు. చట్టాలు కఠినంగాఉన్నాయని, నేర ప్రవత్తి కలిగితే చర్యలు కూడా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే




మానడం చాలా కష్టమన్నారు. డ్రగ్స్ వినియోగంతో ముందుగా మనిషి నాశనమవుతాడని, వారి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మాదకద్రవ్యాలు వినియోగించకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కె.ఢిల్లేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

## జీసీసీ డైరెక్టర్‌గా పిరపాక శ్రీను



**భామిని, నవంబర్ 20(వార్త):** ఐ.టి.డి. ఏ పరిధిలో గల గిరిజన కోఅపరేటివ్ మార్కెటింగ్ సంస్థ పాలక వర్గం నూతన కార్యవర్గం లో భామిని మండలం లోహరిజోల గ్రామానికి చెందిన పిరపాక శ్రీనివాసరావు డైరెక్టర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కార్యవర్గం అధ్యక్షులు కె రామారావు, ఉపాధ్యక్షులు ఎం ఎండయ్య, డైరెక్టర్ లుగా పిరపాక శ్రీనివాసరావు,కె బలరాం, ఎం రత్నలమ్మ,వి సింహాద్రి ఎన్నికైనట్లు మేనేజర్ దాసరి కృష్ణ తెలిపారు. డైరెక్టర్ ఎన్నిక పట్ల స్థానిక వైఎస్ ఆర్ సి పి నేతలు పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

# నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

**వంగర, నవంబర్ 20(వార్త):** స్కిల్ సెన్సస్ పై బుధవారం గ్రామ వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులు, విఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లుకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్వాలిఫికేషన్ ద్వారా శిక్షణ పొందిన అరసాడ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాదు, కొండ చాకరాపల్లి వెల్ఫేర్ అసిస్టెంట్ వైకుంఠరావు వీరికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం వివరించారు. నిరుద్యోగ యువతీ యువకులకు 15 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు మధ్య వయసు ఉన్న వివరాలతో సర్వే చేయాలన్నారు. వారికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాధరావు, ఈఓపిఆర్డి కెల్ల రామారావు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

■ ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే బగ్గు

**నరసన్నపేట, నవంబర్ 20 (వార్త):** వెలగపూడి సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలను నరసన్నపేట శాసనసభ్యులుబగ్గు రమణమూర్తి వివరించారు. నియోజకవర్గ అభి వృద్ధికి సహకరించాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించారు. పారిశుధ్యానికి, తాగునీటికి నిధులను మంజూరు చేయమని కోరారు.



# 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

**వంగర, నవంబర్ 20(వార్త):** తమ డిమాండ్లు పరిష్కరించాలని వంగర మండలం ఎంపీపీ ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ కి తను నివాసంలో వంగర మండల పీహెచ్ సి 104 సిబ్బంది వినతిపత్రం బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లా డుతూ తమకి నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించక కుటుంబాలను పోషించటం చాలా కష్టం అవుతుంది అని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజా దనము వృధాకాకుండా చూడాలి



అని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో 104 ఉద్యోగులు డ్రైవర్ కూనిబిల్లి శ్రీనివాసరావు, డీఈవో డి.ఇందు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సర్వీస్ సమస్యలను పరిష్కరించండి

**వంగర, నవంబర్ 20(వార్త):** మండలంలోని అరసాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏపీటీఎఫ్ 257 సబ్ కమిటీ మీటింగ్ సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎందువ రామకృష్ణ, పి. శ్రీకర్ ఆధ్వర్యంలో సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సర్వీస్ పరమైన సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో అధికారుల దృష్టికి చేర్చి పరిష్కారం చేయాలనే తలంపుతో యూనియన్ చర్చించింది. అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ కు మద్దత్తు ఇవ్వాలని ఉపాధ్యాయులును వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లంక రామకృష్ణ, పూర్వ అధ్యక్షులు పి. దుర్గారావు , బి.ఉమామహేశ్వర రావు , మండల ఉపాధ్యక్షులు ఎం.గోవింద రావు, జి.ఠాగూర్, వి.గోవిందరావు మరియు మండల కార్యదర్శి ఎస్. మల్లేశ్వరరావు పాల్గొన్నారు.




# పాఠశాలల పనివేళల పెంపు సరికాదు



**వంగర, నవంబర్ 20(వార్త):** ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెన్ను వెంటనే వెనుకకు తీసుకోవాలని యూటీఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్ రావు డిమాండ్ చేశారు. బుధవారం వంగర మండలం అరసాడ ప్రాథమిక పాఠశాలలో జరిగిన మండల యూటిఫ్ స్వర్ణోత్సవ సభలకు ముఖ్యఅదితిగా హాజరై ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు పాఠశాలలకు సుమారు 6 కిలోమీటర్లు దూరం నుండి నడిచి లేదా సైకిల్స్ పై వచ్చిన విద్యార్థులను సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలో ఉంచడం వలన వారు ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతుందని, వారికి సరైన భద్రత ఉండదని మరియు 12 గంటలకు చేసిన మధ్యాహ్న భోజనం ఎటువంటి పోషకాహారం తీసుకోకపోవడం తో పిల్లలు అసహనానికి గురికావడం జరుగుతుందని తెలుపుతూ ఇ టువంటి ఉత్తర్వులను ఉపసంహారణ చేసుకోవా లని డిమాండ్ చేశారు. అనంతరం వంగర మండల యూటిఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది.ఎన్నికల పరిశీలకులుగా డివిజన్ కార్యదర్శి గేదల. రమేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.ఈ ఎన్నికల్లో వంగర యూటిఫ్ గౌరవ అధ్యక్షులు:సీర అప్పల నాయుడు,అధ్యక్షులుగా: మాడ్రాపు. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పెంకి గౌరిశంకర రావు, ఉపాధ్యక్షులుగా బలగ ప్రసాద్ మహిళా ఉపాధ్యక్షులుగా పక్కి జ్యోతి, కోశాధికారిగా బోనుమద్దెల శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ:ఆర్ అప్పలనాయుడు, బిరమేష్ "సీపీస్ కమిటీ పి శ్రీరామమూర్తి, బి దుర్గా రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా :డి వెంకటరమణ, టి.దుర్గారావు, టి రమ ణయ్య, ఓవి భాస్కర్‌రావు, బి సింహాచ లం, యస్ లక్ష్మణరావు, పి మురళి తో పాటుగా మరి కొంతమంది మండల కమిటీ సభ్యులను ఎన్నుకు న్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన మండల కార్యవర్గ సభ్యులచే ఎన్నికల పరిశీల కులు ప్రమాణస్వీకారం చేయించారు.

# సక్రమంగా పని చేస్తేనే నిర్దేశిత లక్ష్యాల పూర్తి

**మందస, నవంబర్ 20 (వార్త):** ఉద్యోగులు చిత్తశుద్ధితో సక్రమంగా పని చేయాలని, లేకపోతే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేమనిమందస ఎంపీడీఓ పైల సూర్యనారాయణరెడ్డి అన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందస మండలం భౌగోళికంగాపెద్దదని, దీంతో లక్ష్యం పెద్దదిగా ఉంటుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు నిర్లక్ష్యం వీడనాడాలని అంకితభావంతో పనిచేయాలన్నారు. కుంటిసాకులు చెప్పవద్దని సుతిమెత్తగా హెచ్చరించారు. సమన్వయంతో పనిచేయాలని, గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడంతో గిరిజనులను హౌసింగ్ స్కీంపై చైతన్యం చేయాల న్నారు. సమయపాలన పాటించి,



లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షణ, బిల్లుల చెల్లింపులు చేయాలన్నారు. జిల్లా కేంద్రాల్లో జరిగే సమావేశాలకు డేటాను అందుబాటులో ఉంచాలని, ఉన్నతాధికారుల నుంచి శాఖాపరమైన ఇబ్బందులకు గురికావద్దని కోరారు.

కార్యక్రమంలో ఇన్చార్జి ఏఈ రత్నాల దినేష్కుమార్, వర్కిన్స్పెక్టర్లు కవిటి అశోకకుమార్, పైల సతీష్ కుమార్, తాళ్లగురంటి, భోగాపురం, మందస, సాబతోట, కొండలోగాం, కొంకడాపుట్టి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్.ఏలియారాజా, పవన్కుమార్, నవీన్కుమార్, ఎస్.గురుమూర్తి, బి.లోకేష్, డీఈఓ సార సంతోష్కుమార్ పాల్గొన్నారు.



## గ్రంథాలయం.. విజ్ఞాన సాగరం

**మందస, నవంబర్ 20(వార్త):** గ్రంథాలయం విజ్ఞానానికి సాగరం లాంటిదని, ఆ సేవలు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి, వక్తలు కోరారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు మందసలోని శాఖా గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలుగా పేర్కొన్నారు. పుస్తకాలతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందస పంచాయతీ ఈఓ బమ్మిడి నవీన్‌కుమార్, సూర్యోదయ స్కూల్ డైరక్టర్ మోణంగి నాగేశ్వరరావు, కాశీచరణ్ పట్నాయిక్, తెలుగు పండిట్ ఎం.ధర్మారావు, డిజిటల్ అధికారి జుత్తు నారాయణ రావు, సహాయకుడు ఆర్.మోహనరావు, బంగారు హరిబందు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## 22న పొత్తంగి-సిరిపురంలో వైద్యశిబిరం

**మందస, నవంబర్ 20(వార్త):** మందస మండలంలోని పొత్తంగి-సిరిపురంలో ఈనెల 22న గుండె వ్యాధుల వైద్య శిబిరాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నట్టు గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కొర్ల కన్నారావు, జెమ్స్ ఆసుపత్రి ఏరియా కోఆర్డినేటర్ రాపాక తిరుపతిరావు చెప్పారు. ఉదయం 9 గంటలనుంచి పొత్తంగి-సిరిపురంలోని సంతతోట వద్ద స్కూల్ ప్రాంగణంలో శిబిరం నిర్వహిస్తామన్నారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


## నేత్ర శిబిరంలో 108మందికి పరీక్షలు




**మందస, నవంబర్ 20(వార్త):** మందసలో జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 108మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో మందస భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సమితి(బృందావనం) ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి(శ్రీకాకుళం) ఈ శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య సహాయకురాలు అక్కురాడ కావ్య కంటి పరీక్షలు చేసి, 48మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగింది. క్యాంప్ ఇంచార్జ్ టి.రామారావు, సత్యసాయి బాబా సేవా సమితి కన్వీనర్ వూన్న ఈశ్వరరావు, వడ్డి అప్పారావు, వునా జయరాం, బి.ఆనందరావు, జె. భుజంగ రావు, బి. జ్యోతి, వి.రేవతి, వడ్డి ఝాన్సీ, జోనల్ ఇన్‌చార్జి బమ్మిడి భైరాగి, ఆధ్యాత్మిక వేత్త కొయ్య భావన్నారాయణరెడ్డి, సాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కంటి రోగులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర పంపిణీ చేశారు.

## ప్రభుత్వాసుపత్రిలో పని చేయని బోరు

**నరసన్నపేట, నవంబర్ 20(వార్త):** నరసన్న పేట సామాజిక ప్రభుత్వాసుపత్రిలో చేతిపంపు పనిచేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు పలువురు వాపోయారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని చేతి పంపు నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, కనీస అవసరాలు తీర్చే బోరుబావికి మరమ్మతులు నిర్వహించి రోగుల కష్టాలు తీర్చాలని కోరారు.



## భారీ వాహనంతో ట్రాఫిక్ ఇక్కట్లు

**జలుమూరు నవంబర్ 20(వార్త):** జలుమూరు మండలం చల్లవానిపేట జంక్షన్లో ఆదివారం మధ్యాహ్నం కోటబొమ్మాలి వైపు నుంచి పాతపట్నం వెళుతూ చల్లవానిపేట జంక్షన్లో భారీ లారీ టర్నింగ్ తిరగక పోవడంతో ప్రయాణ రాకపోకలకు గంటకాలం అంతరాయం కలిగింది. కోటబొమ్మాలి నుంచి పాతపట్నం భారీ లారీ, చల్లవానిపేట జంక్షన్లో కాసేపు ఆగడంతో పర్లాకిమిడి నుండి శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు, శ్రీముఖలింగం వెళ్లే వాహనాలు శ్రీముఖ లింగం వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 20 (వార్త):** టాటా స్ట్రైవ్ వారి సౌజన్యంతో బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్స్ చేసేందుకు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు లోపు గల విద్యార్థినీ విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ కోర్సులో చేరవచ్చని సూచించారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే కార్పోరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 9121999654లను సంప్రదించాలన్నారు. ఆసక్తి కలవారు శ్రీకాకుళం సమీపంలో గల రాగోలు లోని జెమ్స్ హాస్పిటల్ క్యాంపస్ లోని తమ కార్యాలయానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

### విభిన్న ప్రతిభావంతులు..

# ఉన్నత శిఖరాలు అందుకోవాలి

* ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం
* జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు
* ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల ఆటలపోటీలు



**శ్రీకాకుళం టౌన్, నవంబర్20 (వార్త):** అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభా వంతులు రాణించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. విభిన్న ప్రతిభా వంతులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకోవాలనే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షించారు. డిశంబరు 3వ తేదీన జరుగనున్న ప్రపంచ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి విభిన్న ప్రతిభా వంతుల ఆటల పోటీలను ఆర్ అండ్ బి డచ్ భవనం వద్ద ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలోను, క్రీడా రంగంలోను ఎవరికీ తీసిపోరని, ప్రతిభకు ఏదీ అడ్డురాదని చెప్పారు. ప్రతిభావంతులకు ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. అందరూ క్రీడల్లో పాల్గొనాలని, ఆటలలో మీ మీ ప్రతిభను కనబరచాలన్నారు. మీలో ఉన్న తెలివితేటలు సద్వినియోగం చేసుకొని, తెలివితేటలకు తోడు ఉన్న రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. దీనిపై అందరూ చైతన్యవంతులు కావాలన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎడి మాట్లాడుతూ డిసెంబరు 3వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం రోజు వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విభిన్న ప్రతిభా వంతులకు బహుమతులు అందజేస్తామన్నారు. బాలురు, బాలికలు 6 నుండి 15 సంవత్సరాల వయసు గల వారికి, 15 సంవత్సరాల పైన సహాయకులతో నడక, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, చెస్, పాటల పోటీలు, కేరమ్స్, క్రికెట్, జావెలెన్ త్రో, ట్రై సైకిళ్లు, తదితరమైన ఆటలలో పోటీలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, డ్వామా పిడి సుధాకర్, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, డియస్డీఓ, సెట్ శ్రీ సిఇఓ ప్రసాదరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, బాలల హక్కుల సంరక్షణ అధికారి రమణ, నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.









## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 20 (వార్త):** కూటమి ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం నగరంలోని 31వ డివిజన్ టీడీపీ ఇన్చార్జ్ విభూది సూరిబాబు తెలిపారు. డివిజన్ పరిధిలోని పట్నాయక్ కాలనీ సాయినగర్ కాలనీలో నూతన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. 31వ డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదు పాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ దక్షిణామూర్తి, డీఈ కమలాకర్, రమేష్, శ్రీను, జై శ్రీరామ్, కృష్ణ, తిరు పతిరావు, భుజంగరావు, మేడి సూర్యనారాయణ, భవాని, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 20 (వార్త):** గత ఎనిమిది రోజులుగా సమ్మెలో ఉన్న శానిటరీ మేస్త్రిలు బుధవారం నుంచి విధుల్లో చేరినట్టు మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు తలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం చేపట్టిన నిరసన దీక్షను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హామీతో తాత్కాలికంగా సమ్మె విరమించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది రోజులుగా మేస్త్రీలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. బుధవారం మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, క్లాప్ డ్రైవర్లు, స్కూల్ స్లీపర్లు, ఆర్టీసీ కళాసీలు, మార్కెట్ కళాసీలు, సివిల్ సప్లై హమాలీలు , ఇతర ప్రజా సంఘాలు తదితర రంగాల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పి.సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు తాత్కాలిక సమ్మెను విరమించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు, శానిటరీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు సతీష్, కిషోర్, రామారావు, యు.రాఘవ, బి.సతీష్, శ్రీను, మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జీ పెద్ద మనెద్ర, రామచంద్ర, తారక, డి.రమణ, అర్జీ గణేష్, సురేష్, సోగ్గాడు, కలగ జగదీష్, అల్లు రవి, తొంపలా షణ్ముఖ రావు, అర్జీ లక్ష్మి, సరస్వతి, సీతమ్మ, కోటి, నారాయణ రావు, సోషల్ మీడియా ప్రతినిధులు అరుగుల రమణ, కళ్యాణి. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# బెంతు సామాజిక సమస్యలు తీర్చండి



* ఆ సామాజిక వర్గానికి న్యాయం చేయాలి * పాతికవేల మంది భవిష్యత్తుపై చర్చ జరగాలి * శాసనమండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు

**కంచిలి, నవంబర్ 20 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాలల్లో ఉంటున్న 25 వేల మంది బెంతొరియా సామాజిక వర్గానికి చెందిన సమస్యలను పరిష్కరించాలని శ్రీకాకుళం నియోజకవర్గ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఆయన శాసనమండలి బడ్జెట్ సమావేశాలలో స్పెషల్ మెన్షన్ హవర్‌లో ఈ అంశాన్ని బుధవారం ప్రస్తావించారు. బ్రిటిష్ కాలం నుండి ఎస్టీలుగా గుర్తింపు పొందిన బెంతొరియాలు ప్రస్తుతం సామాజిక వర్గ సమస్యతో సతమతమవుతున్నారు. వీరంతా ఏ కులానికి చెందినవారో, ఏ ప్రాంతానికి చెందినవారో అధికారికంగా వారికే తెలియదు. 1973 నుంచి 76 వరకు, 81 నుంచి 88 వరకు, 99 నుంచి 2003 వరకు ఆయా ప్రభుత్వాలు బెంతొరియాలను ఎస్టీలుగా గుర్తించింది. ఆ సర్టిఫికెట్లతో చాలామంది ప్రభుత్వ ఉద్యోగాలలో కొలువుదీరారు. కానీ ప్రస్తుతం బెంతొరియాలకు సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదు. నియోజకవర్గంలోని చాలామంది విద్యార్థులు తమ ఉన్నత చదువులకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు పాతికవేల మంది సమస్యకు పరిష్కారమయ్యే మార్గాన్ని ఈ చట్టసభ ద్వారా ఆ సామాజిక వర్గానికి చూపించాలని శాసనమండలి సభ్యులు నర్తు రామారావు కోరారు. 380 రోజులుగా బెంతొరియా పౌరులు కవిటి మండల కేంద్రంలో రిలే దీక్షలు చేస్తున్నారు. వారి సమస్యను పరిష్కరించాలని కౌన్సిల్ చైర్మన్ మోషేన్ రాజును ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546